నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 29 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM



# చేప పిల్లలు చేరేనా?

**ఎంపిక చేసిన చెరువులు : 876**

**చేపపిల్లల ఇండెంట్ 3,30,76,254**

- సీజన్ సగం దాటినా ఇంకా చెరువులకు చేరని చేప పిల్లలు
- ఆగస్టు గడిచిపోతున్నా మొదలుకాని విడుదల పనులు
- జిల్లాలో నెలలతరబడి కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
- ఆందోళన చెందుతున్న మత్స్యకార కుటుంబాలు
- గత కేసీఆర్ ప్రభుత్వంలో మత్స్యరంగానికి పెద్దపీట

ఖమ్మం, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీజన్ సగం దాటినా ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియలో పురోగతి కన్పించడం లేదు. చెరువులకు చేప పిల్లలు చేరే అంశంపై ఇప్పటికి సందేహాలే కన్పిస్తున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో మత్స్యరంగానికి పెద్దపీట ఉండేది. చేప పిల్లల పంపిణీ మొదలుకొని మత్స్యకారులకు అందించే ఇతర అనుబంధ పరికరాల వంటివన్నీ వర్షపాతాన్ని బట్టి సీజన్‌కు అనుగుణంగానే, వీలైతే ముందుగానే అందేవి. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అవేవీ కన్పించడం లేదు. పైగా చేప పిల్లల పంపిణీపై ఇంకా ముందడుగు పడినట్లుగా కూడా కన్పించడం లేదు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఆగస్టు గడిచిపోతున్నా చెరువుల్లో చేప పిల్లల విడుదల పనుల్లో మొదలుకాకపోవడం, టెండర్ల ప్రక్రియ కూడా నెలల తరబడి సాగుతుండడం వంటి అంశాలన్నీ వారి ఆందోళనకు అద్దం పడుతున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది సీజన్ ఆరంభంలో కొంతమేరకు ఆశించిన వర్షపాతం నమోదు కాలేదు. అనంతరం భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. సత్తుపల్లి, వైరా డివిజన్లలో వంద శాతం, మిగిలిన చోట్ల అరవై శాతం చెరువులు నిండిపోయాయి. అయితే 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అన్నట్లుగా ప్రకృతి సహకరించినా.. ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో ఉచిత చేప పిల్లల పంపిణీ అంశం మరింత జాప్యమవుతోంది. సాధారణంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల శాఖలు సీజన్‌కు ముందుగానే వార్షిక ప్రణాళికలు సిద్ధం చేస్తాయి. ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉంటాయి. జూన్ నెలలోనే ఏర్పాట్లకు శ్రీకారం చుడతాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది పరిస్థితి అంతా తారుమారైంది.

### నెలలతరబడి సాగుతున్న ప్రక్రియ

వానకాలం సీజన్ ఆరంభానికి ముందే ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ ముగించాల్సి ఉంది. గత నెలలో 13నే టెండర్లు ఓపెన్ చేయాల్సి ఉంది. అయితే ఒకటో రెండో టెండర్లు రావడంతో ప్రక్రియ 30కి వాయిదా పడింది. మరోసారి కూడా ఆశించిన స్థాయిలో టెండర్లు రాకపోవడంతో మళ్లీ వాయిదా పడింది. ఆ ప్రక్రియ ప్రస్తుతం ఇంకా కొనసాగుతోంది. అయితే, ఆంధ్రా కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకపోవడమే ఆశించిన మేర టెండర్లు రాకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణంగా చేప పిల్లల ఉత్పత్తి ఆంధ్రాలోనే ఎక్కువగా జరుగుతుంది. స్థానికులు టెండర్లు వేసినప్పటికీ ఎక్కువ శాతం చేప పిల్లలను ఆంధ్రా నుంచే తెప్పిస్తుంటారు. అయితే జిల్లాలో కాంట్రాక్టర్లు కుమ్మక్కుకావడం, ఇతర ప్రాంతాల నుంచి టెండర్లు రాకపోవడం వంటివి ఈ ఆలస్యానికి ప్రధాన కారణంగా కన్పిస్తోంది.

జూన్ నెలలో మొదలుకావాల్సిన ప్రక్రియకు.. దాదాపు మూడు నెలలు దాటి ఆగస్టు ముగిసిపోతున్నా అతీగతీలేదు. జిల్లా మత్స్య శాఖలో ఉచిత చేప పిల్లల పంపిణీ అంశంలో కనీస పురోగతి లేదు.

### గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇలా..

మత్స్య కార్మికుల ఆర్థిక పరిపుష్టి కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో వ్యవహరించేది. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించడం, లక్షలాది చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయడం, మత్స్య సాగు సహా మార్కెటింగ్ వంటి అవసరాల నిమిత్తం వాహనాలు, అవుట్ లెట్లు, వలలు, తెప్పలు వంటివి సమకూర్చేది. దీంతో జిల్లాలో మత్స్య ఉత్పత్తి గణనీయంగా పెరిగేది. జిల్లా ప్రజల అవసరాలు పోను ఇతర ప్రాంతాలకు ఎగుమతులూ ఉండేవి. కానీ.. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన ఈ ఎనిమిది నెలల్లో ప్రక్రియ పెద్దగా ముందుకు కదలలేదు.



### సెప్టెంబర్ రెండో వారంలోగా పంపిణీ..


ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ మొదటి వారం లేదా రెండో వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో నిండిన చెరువులను గుర్తించాం. ప్రణాళికనూ సిద్ధం చేశాం. అయితే టెండర్లు ఆశించిన మేర రాకపోవడంతో కొంతమేర అలస్యమైంది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ టెక్నికల్ వర్క్ పూర్తి చేశాం. ఫీల్డ్ వెరిఫికేషన్ూ పూర్తి చేశాం.

**–రాజనర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం**

| మండలం | చెరువుల సంఖ్య | అవసరమైన చేప పిల్లలు |
|---|---|---|
| బోనకల్లు | 22 | 7,53,114 |
| చింతకాని | 44 | 12,72,300 |
| ముదిగొండ | 27 | 12,16,690 |
| ఎర్రుపాలెం | 29 | 10,26,050 |
| మధిర | 21 | 9,87,390 |
| తిరుమలాయపాలెం | 97 | 25,27,290 |
| కూసుమంచి | 39 | 25,26,250 |
| నేలకొండపల్లి | 25 | 11,86,020 |
| ఖమ్మం రూరల్ | 48 | 14,06,230 |
| కల్లూరు | 77 | 27,38,670 |
| పెనుబల్లి | 81 | 36,05,300 |
| సత్తుపల్లి | 39 | 31,04,010 |
| తల్లాడ | 30 | 9,04,440 |
| వేంసూరు | 70 | 29,92,570 |
| ఏన్కూరు | 13 | 3,02,770 |
| కొణిజర్ల | 32 | 14,53,260 |
| సింగరేణి | 63 | 15,86,580 |
| వైరా | 04 | 16,82,250 |
| ఖమ్మం అర్బన్ | 10 | 5,06,520 |
| రఘునాథపాలెం | 44 | 11,30,850 |
| కామేపల్లి | 61 | 1,67,700 |
| మొత్తం | 876 | 3,30,76,254 |

## రేషన్ షాపుల్లో సరుకులు విక్రయిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్




యూనియన్ నేతలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం/ రఘునాథపాలెం, ఆగస్టు 28 : రేషన్‌షాపుల్లో పప్పు, ఉప్పు, సబ్బులు, ఇతర సరుకులు అమ్మితే డీలర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రేషన్‌డీలర్ల అసోసియేషన్‌కు చెందిన అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గత నెల ఆకస్మిక తనిఖీల సందర్భంగా పలు షాపుల్లో కిరాణం సరుకులైన సబ్బులు, ఉప్పు, పప్పు, నూనె ప్యాకెట్లను పెట్టి అమ్మకాలు చేస్తుండటాన్ని గుర్తించి ఆగ్రహానికి గురయ్యారు. ఈ నెల తనిఖీలకు వచ్చినప్పుడు ఎలాంటి కిరాణం సరుకులు షాపుల్లో కనిపించరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రేషన్‌డీలర్లు యూనియన్ జిల్లా ఆఫీస్ నిర్మాణానికి జిల్లాకేంద్రంలో 500 గజాల స్థలాన్ని కేటాయించాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, దొండ దుర్గయ్య, ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇబ్రహీం, బాబు పాల్గొన్నారు.

## ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

### షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని నాయకుల డిమాండ్



భద్రాద్రి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 28 : ఎలాంటి షరతులు, కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ మాట్లాడుతూ రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం షరతులు విధించడం సరికాదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయాల్సిన ప్రభుత్వం.. కేవలం 50 శాతం మంది రైతులకు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. మూడు విడతల్లో కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి వేలాది మంది రైతులను మోసం చేసిందని వారు ఆరోపించారు. బేషరతుగా రుణాలన్నీ మాఫీ చేసి రైతులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణ, అడుసుమిల్లి సాయిబాబు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, గుగులోత్ రాంచందర్, నరాటి రమేశ్, పరమ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఆరోగ్యం

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 28 : నిరంతరం క్రీడల సాధనతో ఆరోగ్యవంతంగా ఉంటారని, ఎలాంటి అలసట లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం క్రీడా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శరీర దృఢత్వం, స్నేహభావం ఏర్పడుతుందని, వయసుతో నిమిత్తం లేకుండా క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించవచ్చన్నారు. అనంతరం ఉద్యోగులకు బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, త్రోబాల్, చెస్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, 100 మీటర్ల వాక్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. డీవైఎస్‌వో



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పరంధామరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు వద్దిరాజు శుభాకాంక్షలు



కేటీఆర్, కవితలతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 28 : జైలు నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత, దివ్యాంగుల ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి తదితర ప్రముఖులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కవిత విడుదల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

### మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు



మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ మాజీ లోక్ సభాపక్ష నేత, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో న్యాయవాదులు రాజకీయ పార్టీల తరపున కాదు.. న్యాయసూత్రాల ఆధారంగా వాదిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితపై లేనిపోని ఆరోపణలు చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు ప్రయత్నించినా.. అత్యున్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంపై సత్యం ఎప్పుడూ గెలుస్తుందనేది సాక్షాత్కరింపజేసిందన్నారు. ఆమె రాష్ట్ర ప్రజల కోసం అంకితభావంతో పని చేసిన నాయకురాలని, తెలంగాణోద్యమంలో సాంస్కృతిక పరంగా కీలక పాత్ర పోషించారని నామా గుర్తు చేశారు.

## కవిత కేసులో న్యాయమే గెలిచింది

### బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షురాలు అభిలాష



అభిలాష గొడిశాల

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కవిత కేసులో చివరకు న్యాయమే గెలిచిందని, ఆమెకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడం సంతోషకరమైన విషయమని కువైట్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం అధ్యక్షురాలు అభిలాష గొడిశాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ పేరుతో తెలంగాణ ఆడబిడ్డ, ఎమ్మెల్సీ కవితపై ఈడీ అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూపకుండా దాదాపు 5 నెలలపాటు జైలులో ఉంచారని, కోర్టుకు సైతం ఒక్క ఆధారం సమర్పించలేదని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే కవితను జైలుకు పంపించారని, ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఆమెకు బెయిల్ మంజూరు కావడం మంచి పరిణామమన్నారు.

## కేసులతో బీఆర్ఎస్‌ను బెదిరించలేరు..

### జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు




మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, ఆగస్టు 28 : అక్రమ కేసులతో బీఆర్ఎస్ శ్రేణులను ఎవరూ బెదిరించలేరని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని హర్షిస్తూ మధిర పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ ఇవ్వడంతో న్యాయం తమవైపే ఉన్నట్లు తేలిందన్నారు. కొంచెం ఆలస్యమైనా న్యాయం తప్పకుండా గెలుస్తుందనే విశ్వాసం తమకు ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కేసులు, జైళ్లు కొత్తేమీ కాదని, నిరంతరం తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అప్పారావు, రైతు నాయకులు చావా వేణుబాబు, వీరారెడ్డి, పూర్ణచంద్రరావు, జేవీ రెడ్డి, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ బుర్రి బాబు, నాగేశ్వరరావు, చిప్పగిరి ప్రసాద్, ఆళ్ల నాగబాబు, నరసింహారావు, కొండ, చీరాల రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటుంబ నిర్ధారణ సర్వే షురూ..

- రేషన్ కార్డుదారుల ఇళ్లకు వెళ్లిన అధికారుల బృందాలు
- సర్వేను పర్యవేక్షించిన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు



చింతకానిలో సర్వేతీరును పరిశీలిస్తున్న మధిర ఏడీఏ వెంకటేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 28 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి జిల్లావ్యాప్తంగా కుటుంబ నిర్ధారణ సర్వే బుధవారం ప్రారంభమైంది. 21 మంది మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించగా.. వీరికి సహాయకులుగా 129 క్లస్టర్లకు చెందిన వ్యవసాయ విస్తర్ణాధికారులు పని చేశారు. సర్వే ప్రక్రియను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పర్యవేక్షించారు. జిల్లాలో రేషన్ కార్డు సమస్య కలిగిన రైతులు 49,179 మంది ఉండగా.. అందులో తొలిరోజు 1,442 కుటుంబాలకు చెందిన వివరాలను అధికారులు సేకరించారు. సర్వేను వారం రోజులపాటు నిర్వహించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. తొలిరోజు గ్రామాలకు వెళ్లిన ప్రత్యేక బృందాల అధికారులకు మిశ్రమ స్పందన కనిపించింది. కొన్ని కుటుంబాలు సంతోషం వ్యక్తం చేయగా.. రుణ మాఫీకి దూరమైన మరికొన్ని కుటుంబాలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించాయి. రుణమాఫీ వర్తింపజేసేందుకు పొరపాట్లను సరిదిద్దాలని అధికారుల ఎదుట వాపోయారు. కొద్ది రోజుల్లోనే సాంకేతిక సమస్యలను సరిచేస్తామని అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాల బాధ్యత టీచర్లదే: డీఈవో



కూసుమంచి : టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కూసుమంచి, ఆగస్టు 28: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రాబట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో సోమశేఖరశర్మ సూచించారు. ఇందు కోసం ప్రతి ఉపాధ్యాయుడూ కృషిచేయాలని, విద్యార్థులను తగిన విధంగా సన్నద్ధం చేయాలని సూచించారు. కూసుమంచి మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. కూసుమంచి, ఈశ్వరమాధారం ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. టెన్త్ విద్యార్థుల వద్దకెళ్లి పలు ప్రశ్నలు అడిగారు. ఇప్పటి వరకు జరిగిన పాఠాల్లో విద్యార్థులు నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని వారి తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## పెసర రైతు దిగాలు..

- ఆరుగాలం కష్టం.. దళారుల పాలు
- మద్దతు ధర అందక విలవిల



పెసర పంటను కల్లాల్లో ఆరబెట్టిన రైతులు

కొణిజర్ల, ఆగస్టు 28 : ప్రతికూల వాతావరణం, పెరిగిన పెట్టుబడులు, అందని మద్దతు ధర వెరసి పెసర రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ ఏడాది వానకాలం కొణిజర్ల మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాలకు పైగా రైతులు పెసర పంట సాగు చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినప్పటికీ సకాలంలో వర్షాలు కురవకపోవడం, అవసరం లేని సమయంలో వర్షాలు కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతోపాటు పెసర పంటకు మద్దతు ధర దక్కక రైతు విలవిలలాడిపోతున్నాడు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,682 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు రూ.6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో కనీసం పెట్టుబడి కూడా రాక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో మొక్కజొన్న, మిర్చి పంట సాగు చేయదల్చిన రైతులు ముందస్తుగా దుక్కులు దున్ని పెసర చల్లారు. అందుకుగాను గడ్డిమందులు, పురుగుమందులు, ఎరువుల వాడకానికి ఒక్కో ఎకరానికి రూ.10 వేల పైబడి ఖర్చు చేశారు. గత ఏడాది ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రాక అంతే దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు పెసర పంట సాగు చేశారు. కానీ ఈ ఏడాది వానకాలంలో ఎకరాకు ఒకటి నుంచి రెండు క్వింటాళ్లకు మాత్రమే దిగుబడి వస్తున్నది. విత్తనాలు, పురుగుమందుల పిచికారీ, ట్రాక్టర్ దుక్కులు, కోత యంత్రం తదితర పెట్టుబడులు కూడా రాని దయనీయ పరిస్థితి దాపురించింది. తీరా ఇప్పుడు స్వల్పంగా దిగుబడి వచ్చిన పంటకు మద్దతు ధర రాక, దళారులు రూ.5 వేల నుంచి రూ.6 వేలకే అడుగుతుండడంతో కర్షకుల కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. గతంలో నాబార్డు, మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగి రైతుల నుంచి మద్దతు ధరకు పెసలు కొనుగోలు చేయడంతో రైతుకు కొంత గిట్టుబాటు అయ్యేది. బహిరంగ మార్కెట్‌లోనూ వ్యాపారులు పోటీపడి గత ఏడాది రూ.8 వేల దాక పెట్టి కొనుగోలు చేశారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలు సైతం అందుబాటులో లేకపోవడంతో పెసర రైతుకు తీవ్రనష్టం వాటిల్లుతున్నది. ప్రకృతి విపత్తు, ప్రభుత్వ సహకార లేమి వెరసి పెసర రైతు దివాలా తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సర్కారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు పెసర కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకొని తమకు అండగా నిలవాలని కర్షకులు కోరుతున్నారు.

### సంకటంగా మారిన సాగు



ఓ వైపు ప్రతికూల వాతావరణం, మరోవైపు పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో సాగు సంకటంగా మారింది. పెసర పంట వేసిన మొదట్లో విపరీతమైన వర్షాలతో విపరీతంగా రొట్ట పెరిగి గణనీయంగా దిగుబడి తగ్గింది. దీంతో పెసర పంట సాగు సంకటంగా మారింది.

**– అడపా శంకరయ్య, రైతు, రామచంద్రాపురం**

### రెండు బస్తాలకు మించి దిగుబడి రాలే..



గత ఏడాది ఒక్కో ఎకరాకు 5 నుంచి 6 బస్తాల దిగుబడి రాగా రూ.8 వేల పైచిలుకు ధరతో వ్యాపారులు కొనుగోలు చేయడంతో పెసర పంట లాభదాయకంగా ఉండేది. ఈ ఏడాది ఎకరాకు రెండు బస్తాలకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడుల్లో సగం కూడా చేతికందడం లేదు. కనీసం సర్కారు కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

**– పాముర్తి నాగయ్య, రైతు, సింగరాయపాలెం**